




# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబరు 13 2025 | సంపుటి :2 | సంచిక : 10 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..

## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!



ఇంటర్నెట్ డెస్క్: బిహార్ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. భాజపా, జేడీయూలు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. కూటమి పక్షాలు ఈ సర్దుబాటును స్వాగతించాయని కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

2లో ▸

## తొక్కిసలాట ఘటనకు సెంథిల్

## బాలాజీనే కారణం: నైనార్ నాగేంద్రన్




కరూర్: టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదానికి డీఎంకే పార్టీ మాజీ నేత సెంథిల్ బాలాజీ నే కారణమని ఆరోపించారు. పథకం ప్రకారం ఆయన ఆ ప్రాంతంలో తొక్కిసలాట జరిగేలా చేశారని..అందువల్లే 41మంది ప్రాణాలు కోల్పోయారన్నారు.
2026 ఏప్రిల్ 20 తర్వాత తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని.. జనవరి 10 తర్వాత ఈ కూటమి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారని నాగేంద్రన్ పేర్కొన్నారు. డీఎంకే కూటమిలోని రెండు వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వాటితో కలిసి పోటీ చేస్తుందా లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు. డీఎంకే అధికారం చేపట్టి నాలుగేళ్లైనా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమీ చేయని ముఖ్యమంత్రి స్టాలిన్ తన కొడుకును మాత్రం ఉప ముఖ్యమంత్రిని చేశారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నిటికి ఆయన జవాబు చెప్పాల్సి ఉంటుందన్నారు.

## సైనిక్ స్కూళ్లలో మీ పిల్లల్ని చేర్పిస్తారా?

దేశ రక్షణ రంగంలో పనిచేయాలని చిన్నప్పట్నుంచే కలలుగనే విద్యార్థులకు ఇదో గొప్ప సువర్ణావకాశం. త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల విద్య నుంచే సిద్ధం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైనిక పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఈ ఏడాది ముందుగానే వచ్చేసింది.

2లో ▸




## కులం ఆధారంగా నాపై కుట్రలు చేస్తున్నారు: మంత్రి వివేక్



హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో టార్గెట్ చేసి.. కులం ఆధారంగా తనపై కుట్రలు, విమర్శలు చేస్తున్నారని మంత్రి వివేక్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో జరిగిన మాలల ఐక్య సదస్సులో మాట్లాడిన ఆయన.. అడ్లూరి లక్ష్మణ్‌ను రెచ్చగొట్టి తనపై విమర్శలు చేయించారన్నారు. "జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలిస్తే తనకు మంచి పేరు వస్తుందని కుట్ర చేస్తున్నారు. లక్ష్మణ్ నాపై ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఆయన వచ్చినప్పుడు నేను వెళ్లిపోతున్నాననేది అబద్ధం. లక్ష్మణ్‌ను రాజకీయంగా ప్రోత్సహించింది మా నాన్న వెంకటస్వామి. ఈ విషయాన్ని ఆయన మర్చిపోయారు. నాకు మంత్రి పదవిపై వ్యామోహం లేదు" అని అన్నారు.

## ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు: రేవంత్‌రెడ్డి

నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే దామన్న (రాంరెడ్డి దామోదర్ రెడ్డి) వల్లే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
ఎస్సారెస్పీ-2 కి ఆర్‌డీఆర్ (మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి) అని నామకరణం చేస్తామని ప్రకటించారు.
నామకరణానికి సంబంధించిన జీవోను 24 గంటల్లోగా తెస్తామని తెలిపారు.
తుంగతుర్తిలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.
నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టడంలో దామన్న కృషి చేశారని పేర్కొన్నారు.



తుంగతుర్తి: నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే దామన్న వల్లే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ-2కి ఆర్‌డీఆర్ (మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి) అని నామకరణం చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవో తెస్తామన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.
"నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని దామన్న నిలబెట్టారు. ఆనాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ప్రాజెక్టును తీసుకొచ్చారు. తుంగతుర్తి ప్రజల కోసం దామన్న పనిచేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అధిష్ఠానం అండగా ఉంటుందని సోనియా గాంధీ చెప్పారు. ఆయన కుటుంబానికి రాజకీయంగా అవకాశం ఇస్తాం. దామన్న మృతి పట్ల సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.



## తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు.. ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశారు.

2లో ▸

## చీరాల వాడరేవు తీరంలో విషాదం.. సముద్రంలో ఐదుగురు గల్లంతు

బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరంలో విషాదం నెలకొంది. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు.

2లో ▸

## హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: కిషన్‌రెడ్డి



మిగతాది 2లో

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ విమర్శ: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కిషన్‌రెడ్డి విమర్శించారు.
రిజర్వేషన్ల పరిమితి (50% క్యాప్): సుప్రీంకోర్టులో రిజర్వేషన్లకు 50శాతం పరిమితి (క్యాప్) పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అని పేర్కొన్నారు.

## రెండేళ్లవుతున్నా..

## ఇంకా కేసీఆర్‌నే నిందిస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలని పార్టీ శ్రేణులను భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా కాంగ్రెస్ నేతలు ప్రతిదానికీ ఇంకా కేసీఆర్‌నే నిందిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని అడిగితే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.



## సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై 'మా' అధ్యక్షుడికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫిర్యాదు



హైదరాబాద్: సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫిర్యాదు చేశారు. గాంధీజీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాంత్ అయ్యంగార్ 'మా' సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. పబ్లిసిటీ కోసమే చరిత్రను ఆయన వక్రీకరించారని విమర్శించారు. గాంధీ సిద్ధాంతాన్ని నమ్మే వారి మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. నటుడిపై 'మా' కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సినీ పెద్దలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించాలన్నారు.

## కుమారుడు చూస్తుండగానే.. భర్తను హత్య చేసిన భార్య



2లో

## నా శాఖలో పొంగులేటి పెత్తనం.. మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు



2లో

## మెరిసిన స్మృతి మంధాన, ప్రతీక రావల్.. ఆస్ట్రేలియా టార్గెట్ 331



2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబరు 13 2025


# మడికొండలో పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహంగా



**కరపత్రం ప్రతినిధి మడికొండ**
కాజీపేట మండలం, మడికొండ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెన్నార్ నగర్, బొడ్రాయి వద్ద మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఎ. రాజకుమార్, జయరాజు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. “ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలంటే పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి,” అని వైద్య అధికారులు సూచించారు. ఎస్.సీ., బీసీ కాలనీలలో కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఏ చిన్నారి మిగలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. స్థానిక ప్రజలు తమ పిల్లలను తీసుకువచ్చి చురుకుగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పోలియో చుక్కల కార్యక్రమంలో సహకరించిన గ్రామస్థులకు వైద్య అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. “ప్రతి చిన్నారి ఆరోగ్యమే లక్ష్యం వైద్య శాఖ”

# ఫాల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం మల్లికార్జున పల్లి అధ్యక్షులు

**కరపత్రం ప్రతినిధి అక్టోబర్ 12.**



మునిపల్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం మల్లికార్జునపల్లి అధ్యక్షులు బోయిని మొగులయ్య మాట్లాడుతూ నిండు జీవితాలకు 2 ఫాల్స్ పోలియో చుక్కలు గ్రామంలోని ప్రతి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వరూప ఆశ వర్కర్ సంగీతం అంగన్వాడి టీచర్స్ ఎన్ ఈశ్వరమ్మ నవనీత చిన్నపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఆత్మకూరులో పల్స్ పోలియో విజయవంతం



**కరపత్రం ప్రతినిధి ఆత్మకూరు**
ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. స్టేట్ అబ్జర్వేజర్ శ్రీనివాస్ అకస్మార్తిగా కొన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. ఐ రిస్క్ ఏరియాలో పిల్లలకి టీకాలు వేశారో లేదో అని తనిఖీ చేశారు.ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పనితీరును పరిశీలించారు.పోలింగ్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కలు వేయించాలన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలో ఐదు సంవత్సరలోపు పిల్లలకు పోలియో చుక్కలు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వెయ్యడం జరిగింది.మండల వైద్యశాఖ అధికారి డా.కె. స్పందన,తెలిపారు.పల్స్ పోలియో ప్రశాంతంగా ముగిసింది.రేపు మరియు ఎల్లుండి ఇంటింటికి వెళ్లి ఇవ్వాలా పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు వేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ సూపర్వైజర్ ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ఏడబ్ల్యూటిఎస్ పాల్గొన్నారు.

# బాక్సింగ్ తో ఉజ్వల భవిష్యత్తు రాష్ట్ర బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎల్లయ్య బండారి

**కరపత్రం ప్రతినిధి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 12**
కొత్తగూడెం క్రీడలు: విద్యార్థులకు చదువుతో పాటు బాక్సింగ్ క్రీడ వల్ల ఉజ్వల



భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎల్లయ్య బండారి అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ శిక్షణ తరగతుల పర్యవేక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేసిన ఆయన కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో,రామవరంలో బాక్సింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని కొన్ని చిన్న దేశాల పేర్లను సైతం గుర్తు పెట్టుకోవటానికి అక్కడి ప్రజలు క్రీడల్లో రాణించడమే కారణమన్నారు.బాక్సింగ్ సాధనలో భాగంగా విద్యార్థులకు బాక్సింగ్ లో గెలుపొందుటకు మెలుకువలు నేర్పించారు.తల్లిదండ్రులు పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోను ప్రోత్సహించాలని కోరారు. ఒలింపిక్స్ లో కూడా బాక్సింగ్ క్రీడ వున్నందున క్రీడకారులకు ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయని తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం,రామవరం,భద్రాచలం ప్రాంతాల్లో బాక్సింగ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,త్వరలో ఇల్లందు,మణుగూరులలో బాక్సింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించనునట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శివ సుబ్రమణ్యం,కోచ్ లు ఈశ్వర్, సాగర్,కిరణ్,శ్రీమూర్తులు తదితరులు పాల్గొన్నారు

# హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. “ కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో ఏం చేయగలడు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయలేరు. మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయలేకపోయాం. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ.. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది.
సుప్రీంకోర్టులో.. రిజర్వేషన్లకు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం క్యాప్‌నకు వ్యతిరేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది. ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం భాజపా పూర్తి మద్దతు ఉంటుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం 3 పేర్లను జాతీయ పార్టీకి పంపించాం. పార్లమెంటరీ బోర్డు మీటింగ్ తర్వాత అభ్యర్థి ప్రకటన ఉటుంది” అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# మెరిసిన స్మృతి మంధాన, ప్రతీక రావల్.. ఆస్ట్రేలియా టార్గెట్ 331

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. 48.5 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. వన్డే ప్రపంచ కప్‌లో భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్ స్మృతి మంధాన (80బీ 66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ టోర్నీలో తొలిసారి భారీ ఇన్నింగ్స్‌తో అలరించింది. మరో ఓపెనర్ ప్రతీక రావల్ (75బీ 96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిసింది. ఓపెనింగ్ జోడీ దాదాపు సగం ఓవర్లు ఆడి తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

**పోరాడుతున్న వెస్టిండీస్.. మూడో రోజు ముగిసిన ఆట**
హర్లీన్ డియోల్ (38బీ 42 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22) మరోసారి తక్కువ స్కోరుకే నిష్క్రమించింది. జెమీమా రోడ్రిగ్స్ (33బీ 21 బంతుల్లో 5 ఫోర్లు), రిచా ఘోష్ (32బీ 22 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీప్తి శర్మ (1) నిరాశపర్చగా.. అమన్‌జ్యోత్ కౌర్ (16) పరుగులు చేసింది. భారత్ 36 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. ఆసీస్ బౌలర్లలో అన్నాబెల్ సదర్లాండ్ (5/40) అదరగొట్టింది. సోఫీ మోలినెక్స్ 3, మెగాన్ షట్, ఆష్లే గార్డ్‌నర్ తలో వికెట్ తీశారు.

# కుమారుడు చూస్తుండగానే.. భర్తను హత్య చేసిన భార్య

మొదటిపేజీ తరువాయి
కేశంపేట: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. కుమార్ (35)ని కన్నకొడుకు ఎదుటే అతడి భార్య హత్య చేసింది. నిత్యం తాగి వేధిస్తుండటంతోనే సహనం కోల్పోయిన ఆమె హత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. కుమార్ రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి కూడా మద్యం మత్తులో భార్యతో గొడవ పడ్డాడు. సహనం కోల్పోయిన మాధవి.. భర్త నిద్రించిన తర్వాత అర్ధరాత్రి సమయంలో కుమారుడు చూస్తుండగానే.. ఇంట్లో ఉన్న సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి హత్య చేసింది. ఆ తర్వాత మృతదేహాన్ని దగ్గర్లో కొత్తగా నిర్మిస్తున్న సంపులో పడేసి ఇంటికి వచ్చేసింది. కుమార్ సోదరుడు విషయం తెలుసుకొని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మాధవిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# నా శాఖలో పొంగులేటి పెత్తనం.. మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కార్యాలయానికి వారు నేరుగా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు జిల్లా మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనుల టెండర్లలో పొంగులేటి జోక్యం చేసుకున్నారని ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## అధికారంలోకి వస్తే.. మద్యపాన నిషేధం ఎత్తివేస్తాం - జన్ సురాజ్ పార్టీ




బిహార్‌లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మద్యపానంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తామని జన్ సురాజ్ పార్టీ మరోసారి స్పష్టం చేసింది. తద్వారా వచ్చే వేల కోట్ల ఆదాయంతో.. రూ.లక్షల కోట్ల రుణాలు సేకరించేందుకు ఉపయోగిస్తామని తెలిపింది.
లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)కి చెందిన కీలక నేత కుమార్ సౌరభ్ చేరిక సందర్భంగా జన్ సురాజ్ పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది.
“వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని వెంటనే ఎత్తేస్తామని చెబుతున్నాం. తద్వారా రూ.28వేల కోట్ల రెవెన్యూ నష్టాన్ని భర్తీ చేస్తాం. వీటిని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రూ.5-6లక్షల కోట్ల రుణాలను సమీకరించేందుకు ఉపయోగిస్తాం” అని జన్ సురాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ పేర్కొన్నారు. పార్టీలో చేరిన సౌరభ్‌కు ఆర్థిక, న్యాయ అంశాల్లో ప్రావీణ్యం ఉందన్న ఆయన.. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ల నుంచి రూ.లక్షల కోట్ల రుణాలను తీసుకువచ్చేందుకు ఈయనకున్న బ్యాంకింగ్ రంగ అనుభవాలు ఉపయోగపడతాయన్నారు. సౌరభ్ మాట్లాడుతూ.. పీకేతో కలిసి పనిచేసేందుకే జన్ సురాజ్‌లో చేరినట్లు చెప్పారు.
బిహార్‌లో మద్యపాన నిషేధాన్ని నీతీశ్ కుమార్ ప్రభుత్వం ఏప్రిల్ 2016 నుంచి అమలు చేస్తోంది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే.. తమ ప్రభుత్వం ఏర్పాటైన గంటలోనే మద్యపాన నిషేధాన్ని ఎత్తివేస్తామని ప్రశాంత్ కిశోర్ ఇదివరకు ప్రకటించారు. ఇదే వైఖరిని జన్ సురాజ్ మరోసారి స్పష్టం చేసింది.

# తొక్కిసలాట ఘటనకు సెంథిల్

## బాలాజీనే కారణం: నైనార్ నాగేంద్రన్

మొదటిపేజీ తరువాయి
కాగా కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒకవైపు విజయ్‌తో కూటమి చర్చలకు అన్నాడీఎంకే ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు టీవీకేతో పొత్తు పెట్టుకోవాలంటూ కాంగ్రెస్‌లోని ఓ వర్గం పట్టుపడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిసామి ఈనెల 6న విజయ్‌కు ఫోన్ చేసి.. ఆయనకు పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో కూటమి ఏర్పాటు చర్చలకు ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. ఉమ్మడి శత్రువైన డీఎంకేను వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓడించడానికి ఒకే కూటమి గొడుగు కిందకు రావడం అవసరమని సూచించగా పొంగల్ తర్వాత తన వైఖరి వెల్లడిస్తానని విజయ్ సమాధానం ఇచ్చారని సమాచారం. మరోవైపు కేంద్రమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

# సైనిక్ స్కూళ్లలో మీ పిల్లల్ని చేర్పిస్తారా?

మొదటిపేజీ తరువాయి
వచ్చే విద్యా సంవత్సరం(2026-27)లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఎన్‌టీఏ దరఖాస్తులను కోరుతోంది.
సీబీఎస్ఈ ‘సింగిల్ గర్ల్ చైల్డ్’ మెరిట్ స్కాలర్‌షిప్.. దరఖాస్తులు షురూ
గతసారి డిసెంబర్ 2024లో ఈ నోటిఫికేషన్ రాగా.. ఈసారి అక్టోబర్ రెండో వారంలోనే విడుదల చేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో https://exams.nta.nic.in దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కూళ్లన్నీ సీబీఎస్ఈ అనుబంధ ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలలే. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర శిక్షణా అకాడమీలకు ఇక్కడ క్యాడెట్లను సిద్ధం చేస్తారు.
పెన్ను, పేపర్ విధానంలోనే ఈ పరీక్ష ఉంటుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఉంటాయి.
ఆరోతరగతికి దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు 2026 మార్చి 31 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. బాలికలకు సైతం ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి. సీట్ల లభ్యత, వయస్సు ప్రమాణాలు ఇద్దరికీ ఒకేలా ఉంటాయి. అలాగే, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు అభ్యర్థుల వయస్సు 13 నుంచి 15 ఏళ్లు మధ్య ఉండాలి. ఎనిమిదో తరగతి పాసై ఉండాలి.
దరఖాస్తు రుసుం: జనరల్/రక్షణ రంగంలో పనిచేస్తున్నవారి పిల్లలు, ఓబీసీలు (నాన్ క్రిమీలేయర్), ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు రూ.850బీ ఎస్సీ/ఎస్టీలకు రూ.700ల చొప్పున నిర్ణయించారు.
దరఖాస్తు రుసుం చెల్లింపునకు తుది గడువు అక్టోబర్ 31 రాత్రి 11.50గంటల వరకు ఉంది.
దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు సరిదిద్దుకొనే అవకాశం ఉంటుంది.
పరీక్ష జనవరి నెలలో నిర్వహిస్తారు. కచ్చితమైన తేదీని ఇంకా ఖరారు చేయలేదు. అడ్మిట్ కార్డులను తర్వాత విడుదల చేస్తారు. పరీక్ష జరిగిన నాలుగు నుంచి ఆరు వారాల తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు.
పరీక్ష సమయం: ఆరో తరగతి విద్యార్థులకు (మధ్యాహ్నం 2గంల నుంచి సాయంత్రం 4.30గంటలవరకు) 150 నిమిషాలుబీ తొమ్మిదో తరగతి విద్యార్థులకు (మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు) 180 నిమిషాల చొప్పున ఉంటుంది.
ఆరోతరగతికి సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా..: లాంగ్వేజ్ 25 ప్రశ్నలకు 50 మార్కులుబీ మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలకు 150 మార్కులుబీ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలకు 50 మార్కులుబీ జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలకు 50 మార్కులు చొప్పున మొత్తంగా 125 ప్రశ్నలకు 300 మార్కులకు పరీక్ష ఉంటుంది.
తొమ్మిదో తరగతికి సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా..: మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలకు 200 మార్కులుబీ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలకు 50 మార్కులుబీ ఇంగ్లిష్ 25 ప్రశ్నలకు 50 మార్కులుబీ జనరల్ సైన్స్ 25 ప్రశ్నలకు 50 మార్కులుబీ సోషల్ సైన్స్ 25 ప్రశ్నలకు 50 మార్కులు చొప్పున మొత్తంగా 150 ప్రశ్నలకు 400 మార్కులకు పరీక్ష ఉంటుంది.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలివే..: అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంబీ తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్
తెలుగు రాష్ట్రాల్లో సైనిక పాఠశాలలు ఎక్కడెక్కడ ఉన్నాయి? పరీక్షా విధానం ఎలా ఉంటుంది? సిలబస్, రిజర్వేషన్ తదితర సమగ్ర సమాచారాన్ని ఈ బుక్‌లెట్‌పై క్లిక్ చేసి పొందొచ్చు.

# తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు.. ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య

మొదటిపేజీ తరువాయి
జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్‌గా వీజీ నారగోని వ్యవహరించనున్నారు. బీసీ జేఏసీలో ముఖ్యమైన ఆరుగురితో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే.. కేంద్రంపై ప్రభావం పడుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లలో ఏ అంశం మీద కోర్టు స్టే ఇచ్చిందని కృష్ణయ్య ప్రశ్నించారు. “ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక స్టే ఇవ్వకూడదు. బీసీలకు న్యాయం కోసం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చాం. అన్యాయాన్ని 76 ఏళ్లుగా బీసీలు భరిస్తూ వస్తున్నారు. బీసీలకు అన్యాయంతోపాటు ఇప్పుడు అవమానం జరిగింది. చట్టసభల్లో బిల్లు పెట్టే వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం” అని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

# చీరాల వాడరేవు తీరంలో విషాదం.. సముద్రంలో ఐదుగురు గల్లంతు

మొదటిపేజీ తరువాయి



చీరాల: బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరంలో విషాదం నెలకొంది. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు సందర్శకులు సూర్యలంక బీచ్‌తో పాటు, వాడరేవు సముద్ర తీరానికి వస్తుంటారు. ఈ క్రమంలో అమరావతిలోని విట్ యూనివర్సిటీ నుంచి కొందరు విద్యార్థులు బృందంగా వాడరేవు వచ్చారు. వారిలో సాకేత్, సాయి మణిదీప్, జీవన్ సాత్విక్‌లు అలల తాకిడికి కొట్టుకుపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో విద్యార్థి సోమేష్‌తోపాటు చీరాలకు చెందిన గౌతమ్ సముద్రంలో గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# రాజన్నను దర్శించుకున్న సీఎం ఓఎస్‌డీ శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఓఎస్‌డి వేముల శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. దర్శనమనంతరం మహా మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ప్రధాన ఆలయ ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు.

# సమాచార హక్కు చట్టం సామాన్యుడి వజ్రాయుధం

- రాష్ట్రం అంతటా అవగాహన సదస్సులు
- ఫోరమ్ ఫర్ ఇన్ఫర్మేషన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

సమాచార హక్కు చట్టం సామాన్యుడి వజ్రాయుధమని, సమాచార హక్కు చట్టంపై త్వరలో రాష్ట్రమంతటా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఫోరం ఫర్ ఇన్ఫర్మేషన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిందని, ప్రశ్నించడం మన ప్రాథమిక హక్కని, సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం సమాచార హక్కు చట్టమని, అధికారులు అక్రమాలకు పాల్పడితే సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి అవినీతి అక్రమాలను బయటకు తీయవచ్చని ఆయన అన్నారు.

# ఈనెల 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి

- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

ఈ నెల 19న ఆదివారం శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు విధుశేఖర భారతి స్వామి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం వెల్లడించారు. శృంగేరి పీఠాధిపతి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై రాజన్న ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, దేవాదాయ శాఖ సలహాదారు గోవింద హరి, ఆలయ ఈవో రమాదేవి, అలయ స్థానాచార్యులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆదివారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పీఠాధిపతి రానున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు.

# హాఫ్ మారథాన్ లో ప్రతిభ కనబరచిన సురేష్




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 12:** భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న అలుగు సురేష్ వృత్తిలోనే కాకుండా తనకు ఇష్టమైన పరుగు పందెం పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పై అధికారుల ప్రశంసలను పొందుతున్నాడు. ఇదే కాకుండా గతంలో జరిగిన సిద్దిపేట, కామారెడ్డిలో జరిగిన హాఫ్ మారథాన్ లో కూడా ప్రతిభను కనబరిచాడు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రతిరోజు 5నుండి10 కిలోమీటర్లు రన్నింగ్ ప్రాక్టీస్ చేయడం వల్లనే మారథాన్ ను పూర్తి చేయడం సులువుగా అవుతుందని తెలిపారు.

# అనారోగ్యంతో మృతి చెందిన రడపాక సునీత కుటుంబం కు ఎల్లవేళల అండగా.ఉంటాం

**కరపత్రం ప్రతినిధి జనగాం జిల్లా**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి, మృతుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్టేషన్గన్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా అన్నారు. ఇటీవల స్టేషన్ ఘనపూర్ ఎస్సీ కాలనీ చెందిన రడపాక సునీత ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని ఆదివారం ఫోన్లో పరామర్శించి వాల కుటుంబాలకు ప్రగడ సానుభూతి తెలియజేశారు.అనంతరం వారి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని కార్యకర్తలతో అందజేశారు.మృతురాలి కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండదండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో రడపాక సుధాకర్, రడపాక లింగయ్య, మాతాంగి కుమార్, మాడపాక శేఖర్, సింగపురం ప్రతిష్, సింగపురం ప్రవీణ్, సింగపురం కిట్టు, సింగపురం బాబు, సింగపురం వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లపై నమ్మదగిన సమాచారం మేరకు

- మెరుపు దాడి నిర్వహించిన
- వెల్దుర్తి ఎస్ఐ రాజు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి వెల్దుర్తిమాసాయిపేట అక్టోబర్ 12**

నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం పరిధిలోని దామరంచ అటవీ ప్రాంతం అవుట్‌స్కర్ట్స్ వద్ద కొందరు వ్యక్తులు హెడ్స్ అండ్ టేల్స్ అనే జూద ఆట ఆడుతున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న మెదక్ జిల్లా వెల్దుర్తి ఎస్ఐ రాజు తమ పోలీస్సిబ్బందితో కలిసి ప్రత్యేక మెరుపు దాడులను నిర్వహించారు. దాడి సమయంలో, అక్కడ జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపిన ఎస్సై రాజు ఆయన మాట్లాడుతూ సుమారు పది మందికి పైగా వ్యక్తులు అక్కడి నుండి పారిపోయారనిదాడి సమయంలో సంఘటన స్థలాన్ని పరిశీలించగా, జూదంలో ఉపయోగించిన 5 మోటార్ సైకిళ్లు, 8 మొబైల్ ఫోన్లు .3,29,500 రూపాయలనునగదు స్వాధీనం చేసుకున్నామని ఈ నగదు రూపాయలువారు ఆటలోవినియోగించుకున్నారనిఅక్కడి నుండి సేకరించిన ఆధారాలను ఆధారంగా చేసుకొని, జూదం నిర్వహించిన ప్రధాన వ్యక్తులు పరారీలో ఉన్నవారి వివరాలను సేకరించడానికి దర్యాప్తు కొనసాగిస్తామని.







జూదం ఆడటం వలన గ్రామీణ ప్రాంతాల్లో చట్టానికి విధంగా శాంతి భద్రతలకు భంగం కలగవచ్చని, ఇటువంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ఆయనయన తెలిపారు. ప్రజల సహకారంతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తుందని పేర్కొన్నారు. జూదం ఆట వలన నిరుపేద కుటుంబాలు వీధిన పడడమే మీ కాకుండా ముఖ్యంగా భార్య భర్తల కాపురంలో గొడవలకు దిగి భార్య వద్ద ఉన్న మంగళసూత్రాన్ని సైతం తెగ తెంపులుగా చేసుకొని వాటిని ఎక్కడో తాకట్టు పెట్టి డబ్బు రూపంలో తీసుకువచ్చి విచ్చలవిడిగా మద్యం సేవించి జూదం ఆటలాకు బానిసలు అవ్వడమే కాకుండా తమ కుటుంబసభ్యులను పట్టించుకోకుండా జూదానికి అలవాటు పడిన వ్యక్తులు సంసారం అనే పదానికి అర్థం లేకుండా వ్యవహరిస్తూ జూదానికి అలవాటు పడి వారి యొక్క కుటుంబ భారాన్ని పట్టించుకోకుండా వ్యక్తులు వారి జీవితాలని నాశనం చేసుకుంటున్నారని వారి వెనకాల కుటుంబ సభ్యులు ఉన్నారు అనే మమకారాన్ని కూడా మర్చిపోయి జీవితానికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన తెలియజేశారు ఇలాంటి వ్యక్తులను చట్ట పర్యంగా కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఈ సంఘటనపై సంబంధిత విభాగ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని మునుముందు ఇలాంటి జూదం ఎక్కడైతే ఆడిన సంఘట స్థలాన్ని పోలీస్ శాఖ సిబ్బందికి సమాచారాన్ని అందించాలని వెల్దుర్తి మండల ప్రజలను పత్రికగముఖంగా తెలియజేస్తున్నామని వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలియజేశారు .

# పీఠాధిపతుల సూచనల మేరకే ఆలయ అభివృద్ధి పనులు

- 150 కోట్లతో నిర్మాణ పనులు
- అభివృద్ధిలో అన్ని పార్టీలు కలిసి రావాలి
- భక్తులు సూచనలు ఇస్తే స్వీకరిస్తాం
-ఆందోళనలతో భక్తులను అయోమయానికి గురి చేయొద్దు
-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకే శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు 150 కోట్లతో చేపట్టామని, అభివృద్ధికి సంబంధించి భక్తులు సూచనలు ఇస్తే స్వీకరిస్తామని, అభివృద్ధిలో అన్ని పార్టీలు కలిసి రావాలని, ఆందోళనలతో భక్తులను, ప్రజలను అయోమయానికి గురి చేయవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు




చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఆదివారం రాజన్న ఆలయ చైర్మన్ ఛాంబర్ లో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి తో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో అభివృద్ధి విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయని, రాజన్న ఆలయంలో సుమారు 64 నుండి 70 పిల్లర్లతో మండపాల నిర్మాణం చేసే క్రమంలో పెద్ద పెద్ద మిషన్లు లోపలికి వెళ్లాల్సి ఉంటుందని, ఆ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని, 3 కోట్ల 40 లక్షలతో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగానే పనిచేస్తామని, ఆలయ అభివృద్ధి నా ఒక్కడి ఏజెండా కాదని, రాజన్న భక్తుల ఎజెండా అని అన్నారు. 100 సంవత్సరాల వరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు వసతులు కల్పించడానికి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని,ఇల్లు నిర్మాణం జరిగేటప్పుడు ఇంట్లోనే ఉంటామా అలోచన చేయాలని, రాజన్న ఆలయం బంద్ అనేది అవాస్తవమని స్వామి వారికి జరిగే నిత్య పూజలు ఏకాంతగా జరుగుతాయని, ఆలయంలో పనులు జరిగే క్రమంలో మాత్రం భక్తుల రక్షణ కొరకు ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని అన్నారు.

# సికింద్రాబాద్ లో ముదిరాజ్ సంక్షేమ సంఘం అలాయి బలాయి కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్.

**కరపత్రం ప్రతినిధి అక్టోబర్ 12**

మన సంప్రదాయాలు, విశ్వాసాలు, పండగలను రాబోయే తరాలకు సమున్నతంగా అందించడమే ఈ అలాయి బలాయి కార్యక్రమం.

బొడ్డెమ్మ నుండి మొదలుపెట్టి దసరా వరకు అన్నీ కూడా ప్రకృతితో ముడిపడి ఉన్న పండుగలు. ప్రపంచంలో ఎక్కడా కూడా ప్రకృతిని పూజించే పండుగలు లేవు, అవి తెలంగాణలో మాత్రమే ఉంటాయి.బొడ్డెమ్మలో వాడే ఆవు పేడ, దాని పైన పెట్టే గరిక పూసలు, చిన్న బతుకమ్మలో పేర్చి తంగేడు పువ్వు, పెద్ద బతుకమ్మలో పెట్టే 101 పువ్వులతో గౌరమ్మను పూజిస్తాము.

లాల్ దర్వాజా, సికింద్రాబాద్ మహంకాళి బోనాల నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బోనాల జాతరకు ఆద్యులు మనమే.స్త్రీలను పూజించే, గౌరవించే దేశం మనది. బోనం ఎత్తుకున్న, గౌరమ్మను కొలుచుకున్న,



చివరికి అధర్మం మీద ధర్మం గెలిచిన, అసత్యం మీద సత్యం గెలిచిన, దుర్మార్గం మీద ధర్మం గెలిచిన కూడా మనం ఆదిశక్తి అమ్మవారిని కొలుచుకుంటాం. కొరివి కృష్ణ స్వామి, పండుగ సాయన్న ఎవరిని కొలుచుకున్నా జరుగుతున్న రాజకీయా పరిణామాల మీద సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలి, జనాభా సరిపోదు దానికి కావాల్సిన కార్యచరణ కూడా మీరు సిద్ధం చేసుకున్న నాడే పదవులు వస్తాయి తప్ప వేదికల మీద డిమాండ్ చేస్తే పదవులు రావు. నీ ఐక్యత, చైతన్యం, వ్యూహం నీకు ఫలితాలు తెచ్చిపెడుతుంది. మేధాశక్తి, రాజకీయ పరిజ్ఞానం ఎవరి సొత్తు కాదు. ప్రజలలో ఉండే వారే ప్రజల చేత ఆశీర్వదించబడతారు. నాయకులుగా ఎదగాలనాకున్న వారు ఎవరైతే ఉన్నారో... సర్పంచ్ గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా, జిల్లా పరిషత్ చైర్మన్గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా కావాలనుకున్న వారు ప్రజల ప్రేమలు పొందితేనే అవుతారు. ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం రాబోయే కాలంలో మరింత ఐక్యతతో ముందుకు పోవాలని కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో యాదగిరి, సంజీవ్, గణేష్, సతీష్, జగన్ మోహన్ రావు, చొప్పరి శంకర్, ఓబిసి అధ్యక్షులు ఆనంద్, సారంగపాణి, శ్రీనివాస్, లత, హరీష్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శబరిమలలో బంగారం చోరీపై కేంద్రం జోక్యం చేసుకోవాల్సిందే. అయ్యప్ప సేవా సమితి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 12**

శబరిమల శ్రీ ధర్మశాస్త్ర దేవస్థానంలో బంగారం చోరీ, ఆస్తుల దుర్వినియోగం విషయంలో మరియు ట్రావన్కోర్ దేవస్వం బోర్డు నిబంధనల ఉల్లంఘనలపై తీవ్ర ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో తక్షణమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ కరీంనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు విజప్తి చేసింది. ఈ మేరకు అయ్యప్ప సేవా సమితి సభ్యులు కె.పరమేశ్వర్ గురుస్వామి, పి. సత్యనారాయణ గురుస్వామి, జి.నాగరాజు గురుస్వామి, పి.సాయన్న గురుస్వామి తదితరులు కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. "అయ్యప్ప ఆలయ దర్శనంతోపాటు ఆత్మశుద్ధి, విశ్వాసానికి ప్రతీకగా అయ్యప్ప భక్తులు ప్రతి ఏటా శబరిమల యాత్రకు వెళతారు. అందులో భాగంగా 41 రోజులపాటు దీక్ష చేపట్టి ఇరుముడి భారం మోస్తూ అడవుల మధ్య నడుస్తూ, నేలపై నిద్రిస్తారు. శబరిమల అయ్యప్ప స్వామికి అర్పణ భావంతో పవిత్ర యాత్ర చేస్తారు. ఇంతటి విశిష్టత కలిగిన శబరిమల ఆలయంలో



బంగారు ఆభరణాలు చోరీ కావడంతోపాటు తప్పుడు రికార్డులు నమోదు చేసి దేవాలయ ఆస్తులు దుర్వినియోగం చెయ్యడం క్షమించరాని నేరం. ఇది కేవలం ఆర్థిక అవినీతిగా మాత్రమే చూడొద్దు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తోంది." అని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. 1999లో ఆలయంలో ఉపయోగించిన 1.5 కిలోల బంగారాన్ని "రాగి"గా రికార్డు చేసి ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని ఆరోపించారు. బంగారు కవచాన్ని ప్రత్యేక కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండానే ప్రైవేట్ సంస్థకు తరలించి కస్టోడియల్ ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడం హైకోర్టు ఆదేశాలపై ఏర్పడిన సిట్ విచారణ తరువాత మాత్రమే జరిగిందని గుర్తు చేశారు.భక్తుల మనోభావాలను, ఆర్థిక నేరాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. తక్షణమే శబరిమల ఆలయ ఆస్తులపై సీబీఐ పర్యవేక్షణలో ఆడిట్ లేదా సెంట్రల్ హెరిటేజ్ ఆస్తులపై సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. దేవాలయ ఆస్తుల నిర్వహణపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయడంతోపాటు బాధ్యులైన ట్రావెన్ కోర్ బోర్డుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అట్లాగే దేవాలయ ఆస్తులను డిజిటల్ పబ్లిక్ ఇన్వెంటరీ సిస్టమ్ ద్వారా నిర్వహిస్తూ కంట్రోలర్ ఆడిట్ జనరల్ నిర్దేశించిన ప్రమాణాలను పాటించేలా చూడాలని సూచించారు. ప్రజాసేవకులు తమ బాధ్యతల నిర్వహణలో విఫలమైతే వారిపైనా చట్టపరమైన చర్యలకు వెనుకాడొద్దని కోరారు. దీంతోపాటు శబరిమల ఆలయానికి "కేంద్ర సాంస్కృతిక వారసత్వ రక్షణ హోదా కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు, ఓటు చోర్ కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 12**

హుజురాబాద్ నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు సూచన మేరకు బ్లాక్ కాంగ్రెస్ పట్టణ మండల కాంగ్రెస్ పార్టీలో ఆధ్వర్యంలో " ఓట్ చోర్ " కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దేశంలో బిజెపి పరిపాలన వచ్చాక ప్రజల ఓటును బిజెపి చోర్ చేస్తూ అధికారంలోకి రావడం జరుగుతుందని, మా ప్రియతమ నాయకులు రాహుల్ గాంధీ ఆధారాలతో భారత ఎలక్షన్ కమిషన్ పలుమార్లు సమర్పించడం జరిగింది. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ప్రజలకు భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు, ఓటు హక్కును ఎవరు చోర్ చేయకుండా కాపాడాలని భారత ఎలక్షన్ కమిషన్కు ప్రజల ద్వారా సంతకాలు స్వీకరించి పంపించే భాగంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలకు అవగాహన కల్పించి వారి సంతకాలు కూడా స్వీకరించడం జరిగింది. భారత్ ఎలక్షన్ కమిషన్ కు ప్రతి పౌరుల ఓటర్ కార్డు ఫోటోతో



సహా ప్రదర్శించాలని మరియు ఓటును తొలగించడానికి అతని అఫిడవిట్ లేనిది ఓటును తొలగించరాదని ఎలక్షన్ కమిషన్ను డిమాండ్ చేయడం జరిగింది. పై కార్యక్రమం జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు మోలుగూరి సదయ్య నాయకత్వంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గూడెపు సారంగపాణి, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, మార్కెట్ మాజీ డైరెక్టర్ సలీం, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి పింగిలి రాకేష్, పింగిలి రమేష్,మాజీ పట్టణ ఉపాధ్యక్షుడు బుర్ర కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బిట్ల మోహన్, జమ్మికుంట మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ పొన్నగంటి రవీందర్,ఎండ్. సలీం, పిట్టల రమేష్, నరిగే సుమన్ దొగ్గల భాస్కర్, గుర్రపు ప్రవీణ్, ముద్దమల్ల రవి, అజయ్ గౌడ్, చెంచాల శ్రీనివాస్, తిరుపతి శ్రీనివాస్, కట్ట దేవేంద్ర చారి, నల్లగాషా కొమురయ్య, దొడ్డే నవీన్, ఆడెపు కిరణ్, మంద అశోక్ గౌడ్, గుల్లి జపానియా, కొలుగూరి శ్రీనివాస్, కోడిగుడి మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎస్జిఎఫ్ సెలక్షన్స్



**- ఖనిలో ఉత్సాహంగా సాగిన కరాటే టోర్నీ**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 12:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) కరాటే సెలక్షన్స్ గోదావరిఖని పట్టణంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే సెలక్షన్స్ పట్టణంలోని సింగరేణి ఆర్సిఓఏ క్లబ్లో నిర్వహించారు. కరాటే సెలక్షన్స్, టోర్నమెంట్ను రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం ప్రారంభించారు. పెద్దపల్లి కరీంనగర్ జగిత్యాల్ సిరిసిల్ల జిల్లాలకు చెందిన వందలాదిమంది కరాటే క్రీడాకారులు టోర్నమెంట్లో తలపడ్డారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మల్లేశం క్రీడాకారుల నిర్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుండి శారీరకదా ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు ఆత్మ రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ కరాటే శిక్షణ ఇప్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరాటే సెలక్షన్స్ లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కరాటే టోర్నమెంట్ లో జిల్లా పేరును నిలబెట్టి అత్యధిక పథకాలు సాధించాలని క్రీడాకారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా ఎస్జిఎఫ్ సెక్రెటరీ కనుకుంట్ల లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమురోజు శ్రీనివాస్, శోభ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెక్రెటరీ తగరపు శంకర్, స్టేట్ సీనియర్ రెఫరీ రచ్చ శ్రీనివాస్, భవాని, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తౌడబోయిన రాజ్ కుమార్, కొయ్యడ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ మాస్టర్స్ వడ్డేపల్లి సురేష్, కరాటే శ్రీనివాస్, పసునూటి శంకర్, చందు, వడ్డేపల్లి షైనీ,లక్ష్మణ్, మంతిని కొంద్ర నాగరాజు, సురభి వేణుగోపాల్, మన్నన్, జగిత్యాల పవన్, సురభి అన్వేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఐల విజయ్ కుమార్, జావిద్, ఖాజాబీ, శ్రీనివాస్ తో పాటు పెద్దపల్లి కరీంనగర్ జగిత్యాల సిరిసిల్ల జిల్లాలకు చెందిన వందలాది మంది కరాటే క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

**- కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి**
**-మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమల్లు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని, కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ రాజమల్లు అన్నారు. వేములవాడ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అనుబంధమైన సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మహాసభకు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల నుండి కార్మికులు పెద్ద ఎత్తున



పాల్గొన్నారు. మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్మికులు చేసిన పోరాటాలు, సాధించుకున్న హక్కులు,రాబోయే మూడు సంవత్సరాలలో సాధించుకోవాల్సిన హక్కుల గురించి చర్చించుకొని భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా మున్సిపల్ యూనియన్ సిఐటియు అనుబంధ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా యూనియన్ అధ్యక్షునిగా కాసర్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం అశోక్, మరో 10 మంది ఆఫీస్ బేరర్స్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడం రమణ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ముసం రమేష్, ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత్ అశోక్, ఐద్వాజిల్లా ప్రధాన కార్యదర్శి జావాజి విమల, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ సూరం పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, మున్సిపల్ యూనియన్ వేములవాడ పట్టణ అధ్యక్షులు సరిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దుబ్బ లచ్చయ్య, రాష్ట్ర నాయకులు వాయిలాల లక్ష్మి, సిహెచ్ లింగయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు.

**- కరీంనగర్లో స్వయంసేవకుల భారీ కవాతు (పథ సంచలన్).**
**- వందేళ్లుగా సమాజ , మాతృభూమి సేవ కోసం పనిచేస్తున్న ఏకైక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ..**
**- ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవాలంటే సంఘంలోకి వచ్చి పని చేయండి.**
**- విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి, ప్రధాన వక్త అయచితుల లక్ష్మణరావు**





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 12**

రాష్ట్రీయ సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలు కరీంనగర్లో ఘనంగా జరిగాయి. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ వ్యాప్తంగా ఇటీవల విజయదశమి ఉత్సవం పేరిట చేపట్టిన ప్రోగ్రామ్లు, రూట్ మార్చ్ కార్యక్రమాలన్నీ విజయవంతంగా కొనసాగాయి. సంఘ్ శతాబ్ది సందర్భంగా ఆర్ఎస్ఎస్ సమాజ పరివర్తన ద్వారా దేశ పరమవైభవం సాధ్యమని పంచ పరివర్తన్ కు పిలుపునిచ్చింది. స్వయంసేవకులు కుటుంబ ప్రబోధన్, స్వదేశీ, సామాజిక పరివర్తన, పర్యావరణం , పౌర విదుల పట్ల ఆలోచించేలా కార్యక్రమాలపై దిశా నిర్దేశనం చేసింది . శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్లో స్వయంసేవకులు ఆదివారం సాయంత్రం భారీ కవాతు ప్రదర్శన చేపట్టారు. శాతవాహన యూనివర్సిటీ రోడ్ లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నుండి కరీంనగర్ పట్టణంలో పలు ప్రాంతాల మీదుగా రాంనగర్ వరకు రూట్ మార్చ్ ( పథ సంచలన్) కార్యక్రమం కొనసాగింది. తదనంతరం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మైదానంలో సంచలన్ సమరోప్ (ముగింపు సమావేశం) జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య వక్త గా హాజరైన విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయ చితుల లక్ష్మణరావు మాట్లాడుతూ సంఘ్ స్థాపకులు డాక్టర్ కేశవ్ రావు బలి రామ్ పంత్ హెడ్గేవార్ ఆత్మవిశ్వాసంతో, దూర దృష్టితో 1925 సంవత్సరంలో విజయదశమి రోజున ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా సమాజ, మాతృ భూమి సేవ కోసం స్వచ్ఛందంగా పనిచేస్తుందన్నారు. భారతదేశ సమస్యలకు మన సమాజంలో ఉన్న అనైక్యతే ప్రధాన కారణమని డాక్టర్ జి భావించారని, ఆ దిశలోనే జాతిని సంఘటితం చేసే కార్యానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సమాజ , దేశహితం గురించి ఆలోచించే వ్యక్తులు దేశం నలుమూలల నుంచి కావాలనే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. సామాజిక స్పృహ, జాతీయ భావన, సంఘటిత దృష్టి, నిస్వార్థం, తోటి వారి పట్ల ప్రేమ కలిగి ఉండడం, ఈర్ష ద్వేషం లేకుండా ఉండే వ్యక్తుల నిర్మాణం కోసమే ఆర్ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఒక గంట శాఖ కార్యక్రమాల ద్వారా సమాజంలోని వ్యక్తుల్లో పరివర్తన తీసుకురావాలనే సంకల్పంతో ఆర్ఎస్ఎస్ ఇన్నేళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.సంఘ్ ప్రారంభం నుండి హిందూ సామాజానికి అవసరమైన ప్రతి విషయంలో పనిచేస్తూ వస్తుందన్నారుహిందూ సమాజంలో మనమందరం ఒకే జాతి వారం అనే భావన నిర్మాణం కావాలన్నారు. హిందుత్వాన్ని మతకోణంలో , రాజకీయ కోణంలో ఆలోచించినంతవరకు ఆర్ఎస్ఎస్ ని అర్థం చేసుకోలేమని, ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవాలంటే ఒక ఆరు నెలలు సంఘంలో వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చిన సర్ సంఘ చాలక్ మోహన్ భగవత్ జీ చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్య అతిథి సిద్ధార్థ స్కూల్స్ అధినేత దాసరి శ్రీ పాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. సమాజం కోసం పనిచేస్తున్న స్వయంసేవకులు అభినందనీయులన్నారు. దేశానికి ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థ ఎంతో అవసరమన్నారు.ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు బూర్ల దక్షిణామూర్తి, నగర సంఘ చాలక్ హనుమండ్ల శ్రీనివాస్ రెడ్డి , కార్యవాహ చామ మహేశ్వర్ స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థిని అభినందించి శాలువతో సత్కరించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 12**

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అయిన తర్వాత జమ్మికుంట నివాసులు అంబాల ప్రభు - లత ల ప్రథమ పుత్రిక అంబాల అక్షిత మెడికల్ కౌన్సిలింగ్లో వరంగల్ ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందినందున, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇంజమ్ వెంకటస్వామి, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొలుగురి సదయ్య లు సీట్ సాధించిన కుమారి అంబాల అక్షత ను శాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి,సదయ్య మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పోరాటం ద్వారా భారత అత్యున్నతమైన సుప్రీంకోర్టు తీర్పు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో SC వర్గీకరణ బిల్లు ఆమోదించిన తర్వాత మాదిగ జాతి, మాదిగ ఉప కులాలకు ఫలాలు అందుతున్నాయి అంటే ఇదే ఉదాహరణ అని అన్నారు.

# ఎకో బజార్ పోస్టర్ ఆవిష్కరణ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 12:**




గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో కళాశాల స్థాయి ఎకో బజార్ కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ హరిత దళం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ప్లాస్టిక్ వస్తువుల వాడకం వలన వచ్చేటువంటి అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్ సమన్వయకర్త జి.అంజన్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువులైన క్యారీ బ్యాగ్స్, ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసులు వంటివి వాడకుండా వాటి స్థానంలో జ్యూట్ బ్యాగులు స్టీల్ బాక్సులు, గాజు, పింగాణి వస్తువులను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఈ.మనోహర్, అంజన్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ రవి, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, డాక్టర్ రఘుపతి, అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సహచరుడి కూతురి పెళ్ళికి మిత్రుల ఆర్థిక సాయం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 12:**



తమతో దాదాపు 35 సంవత్సరాలపాటు పనిచేసి, మృతి చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు జహీద్ కుమార్తె వివాహం సందర్భంగా, ఓసీపీ-1 డ్రాగ్ లైన్ ఉద్యోగులు మానవతను చాటుకున్నారు. రూ.65,500ను సమకూర్చి, తమ ప్రతినిధులు మాజీ డీజీఎం కొత్త కిషన్, ఆపరేటర్ చంద్రపాల్ చేతుల మీదుగా ఆదివారం గోదావరిఖని అశోక్ నగర్ లోని జహీద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలిసి పనిచేసిన సహచరుడి కుటుంబం పట్ల బాధ్యతగా భావించి, అందరం సమిష్టిగా ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సహకరించిన డ్రాగ్ లైన్ ఉద్యోగులకు వారు కృతజ్ఞతలు తెలుపగా, కుటుంబ సభ్యులు తమకు ఆర్థిక సహాయం అందించిన వారికి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డ్రాగ్ లైన్ ఆపరేటర్ రామ్మోహన్, జహీద్ కుటుంబ సభ్యులు ఇజాజ్ అమేనా, ఖయ్యుమ్, జెబా తబస్సుమ్ ఉన్నారు.

# జాతీయస్థాయిలో కాంస్య పథక విజేతకు అభినందనలు. రవీందర్ సింగ్




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 12**

జాతీయస్థాయి సీనియర్స్ యోగాసనా చాంపియన్షిప్లో కాంస్య పతకము సాధించిన పొన్నపాటి అరుణకుమారిని తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అభినందించినారు. ఈ నెల 9 నుండి 12 వరకు మైసూర్ లో జరిగిన 50వ సీనియర్స్ జాతీయ స్థాయి యోగాసన చాంపియన్షిప్ లో 45 సంవత్సరంల పైబడిన కేటగిరిలో పొన్నపాటి అరుణకుమారి కాంస్య పథకం మొదటిసారి సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో ఇనుమడింపజేసినట్లు ఆయన కొనియాడారు. ఈ మెన స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో రాష్ట్రం నుండి మరింత మంది యోగా క్రీడాకారులు జాతీయ , అంతర్జాతీయ స్థాయికి ఎదిగి పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భముగా యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జాల మనోహర్ కుమార్, తెలంగాణ యోగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ ఎన్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జి ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి వివిధ జిల్లాల యోగ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, ఐశ్వర్య , కమలాకర్, బాలరాజు, మనోజ్ కుమార్, గంగాధర్, విజయ్ కుమార్ ఉప్పాల శ్రీనివాస్, ఉప్పు రవీందర్, ఎంఏ మతిన్, కోచ్ మేనేజర్లు తదితరులు ఆమెను అభినందించారు.